ఆవిష్కరణలకు ఏఐ ఉత్ప్రేరకం

రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మార్కెట్‌లోకి బీసీఎస్ నూతన ఉత్పత్తులు



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న బ్లూ క్లౌడ్ సాఫ్ట్ టెక్ (బీసీఎస్).. సోమవారం నాలుగు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో బ్లూహెల్త్ యాప్, బ్లూరా, ఎడ్యు జెనీ, బయోస్టర్ ఉన్నాయి. ఈ వినూత్న ఉత్పత్తులను హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ రంగంలోనూ కొత్త ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా ఏఐ నిలుస్తున్నదని, ఆరోగ్య సంరక్షణలో ఏఐ అంటే జీవితాలను మార్చగలిగిన శక్తి అన్నారు. ప్రభుత్వ మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, బీసీఎస్ చైర్‌పర్సన్ జానకి యార్లగడ్డలు పాల్గొన్నారు.

తెలంగాణకు ఎస్‌జీ గ్రూప్!

సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడుతున్న ఎస్‌జీ గ్రూప్, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈవీల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఎస్‌జీ గ్రూప్ ఆసక్తి చూపుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం ఎస్‌జీ గ్రూప్ ఎండీ యోగేష్ భాటియా, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీ శ్రీరంగారావులు సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యోగేష్ భాటియా ముందుకొచ్చారని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. తద్వారా 1,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అంతకుముందు రాష్ట్రంలో ఈవీల ఉత్పత్తికున్న అనుకూలతల్ని మంత్రి భాటియాకు వివరించారు. పెట్టుబడులు పెడితే అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై భాటియా సానుకూలంగా స్పందించారు.

ఏఐపీఎంఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 7: ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి వెన్నం నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగనున్నారు. రూ.3.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమలో తొలిసారిగా తెలుగువారికి ఉన్నత పదవి వరించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఏఐపీఎంఏకి 175 నగరాల్లో 22 వేలకు పైగా సభ్యులు ఉన్నారని, వీరిలో 90 శాతం మంది ఎంఎస్ఎంఈ రంగానికి చెందినవారేనని ఈ సందర్భంగా అనిల్ రెడ్డి తెలిపారు.

ఏఏఏఐ డైరెక్టర్‌గా మళ్లీ కే శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్ 7: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఏఐ) డైరెక్టర్‌గా తిరిగి స్లోకా అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కే శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రకటనలు, మార్కెటింగ్ రంగంలో శ్రీనివాస్‌కు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. శ్రీనివాస్ మాట్లాడుతూ..ఈ ప్రతిష్ఠాత్మక సంఘం బోర్డు డైరెక్టర్‌గా మళ్లీ ఎంపికకావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఇదో గొప్ప అవకాశం, బాధ్యత అన్నారు.

బ్యాంకుల్లో పైసల్లేవ్

నానాటికీ తగ్గుతున్న డిపాజిట్లు

మారిన సగటు మదుపరి పోడుపు • ఫండ్లవైపే భారతీయుల చూపు

రూ.0.95 లక్షల కోట్లకు పతనం

దేశీయ బ్యాంకుల్లో నగదు లభ్యత గరిష్ఠంగా రూ.2.86 లక్షల కోట్ల నుంచి రూ.0.95 లక్షల కోట్ల కనిష్ఠానికి దిగజారినట్టు యూనియన్ బ్యాంక్ రిసెర్చ్ రిపోర్టు చెప్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో బ్యాంకులకు దిశా-నిర్దేశం చేసినప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించకపోవడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పదేపదే బ్యాంకుల్లో తరిగిపోతున్న ద్రవ్యలభ్యతపై హెచ్చరికలు చేశారు. న్యూఢిల్లీ, అక్టోబర్ 7: దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థకు పెద్ద కష్టమే వచ్చిపడింది. డిపాజిట్లు లేక ద్రవ్యలభ్యత కరువైపోయింది మరి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన పరిశోధనాత్మక నివేదిక.. భారతీయ బ్యాంకులు ఎదుర్కొంటున్న నగదు కొరత, పడిపోతున్న డిపాజిట్లకు అద్దం పడుతున్నది.

చివరకు ఆర్బీఐ కూడా డిపాజిట్ల వృద్ధిపై బ్యాంకులు దృష్టి పెట్టాలని, లేకపోతే సమస్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది ఆగస్టు 2న బ్యాంకుల్లో రూ.2.56 లక్షల కోట్లుగా ఉన్న ద్రవ్య లభ్యత.. 16న రూ.1.55 లక్షల కోట్లకు పడిపోయింది. 28న ఇది రూ.0.95 లక్షల కోట్లకు దిగజారింది.

ఇదీ సంగతి..

బ్యాంకుల్లో ఎఫ్‌డీ అంటే సురక్షితమైన పెట్టుబడి. గృహస్తులు, సీనియర్ సిటిజన్లు, ఇన్వెస్టర్ల ఆసక్తి ఎఫ్‌డీలపైనే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. రిస్క్ ఉన్నప్పటికీ అధిక రాబడులనిచ్చే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల పైనే దేశీయ మదుపరుల చూపు పడుతున్నది. మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌లోకి గృహస్తులు తమ సేవింగ్స్‌ను పెద్ద ఎత్తున తరలిస్తున్నారని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. వీటితో పోల్చితే స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో 2-3 రెట్లు రాబడులు ఎక్కువగా వస్తుండటంతో అంతా ఆవైపే వెళ్తున్నారు. కానీ మార్కెట్లు నష్టపోతే ఇన్వెస్టర్లకూ నష్టాలు తప్పడం లేదు. అయినప్పటికీ ఓవరాల్‌గా లాభాలే కనిపిస్తుండటంతో అంతా ఎఫ్‌డీలకు బదులుగా మ్యూచువల్ ఫండ్లకే ప్రాధాన్యతనిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కఠిన చర్యలున్నా..

హై రిస్క్‌తో కూడిన పెట్టుబడుల వైపే దేశంలోని రిటైల్ ఇన్వెస్టర్లు అడుగులు వేస్తుండటంతో మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. ఈ పోకడకు బ్రేకులు వేసేందుకు కఠిన చర్యల్నే చేపడుతున్నది. ముఖ్యంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) ట్రేడింగ్‌లో పెట్టుబడులపట్ల నిబంధనల్ని కఠినతరం చేసింది. అయితే డిపాజిటర్లను ఆకర్షించేందుకు బ్యాంకులు కూడా వడ్డీరేట్లను పెంచాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. కానీ అదే జరిగితే రుణాలపై వడ్డీరేట్లనూ పెంచాల్సి వస్తుందని బ్యాంకర్లు బదులిస్తున్నారు.

9 లక్షల కోట్లు ఆవిరి

వరుస నష్టాల్లో మదుపరులకు పెద్ద దెబ్బ

ఆరు సెషన్లలో 5,100 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై, అక్టోబర్ 7: వరుసగా ఆరో రోజూ కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తడం, అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఇంట్రాడేలో 81 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 638.45 పాయింట్లు నష్టపోయి 81,050 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 218.85 పాయింట్లు కోల్పోయి 25 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 24,795.75 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరుల సంపద లక్షల కోట్ల స్థాయిలో కరిగిపోయింది. వరుసగా ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,521.85 పాయింట్లు లేదా 5.28 శాతం నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.9 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీ మార్కెట్ విలువ రూ.8,90,153.84 కోట్లు కరిగిపోయి రూ.4,51,99,444.70 కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) వద్దకు పడిపోయింది. అంతకుముందు రూ.4,60,89,598.54 కోట్లు (రూ.5.49 ట్రిలియన్ డాలర్లు) గా ఉన్నది.

- అదానీపోర్ట్స్ 4.17 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా యుటిలిటీ రంగ షేర్లు అత్యధికంగా 3.63 శాతం నష్టపోగా, పవర్ 3.14 శాతం, సర్వీసులు 3.12 శాతం, కమోడిటీస్ 2.54 శాతం, టెలికం 2.49 శాతం, ఎనర్జీ 2.46 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.38 శాతం చొప్పున నష్టపోయాయి.
- కానీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు కదంతొక్కడంతో సూచీల భారీ నష్టాలు తగ్గించుకోగలిగింది.
- సర్వీసు క్వాలిటీ విషయంలో అభ్యంతరాలు వ్యక్తంకావడంతో ఓలా షేరు 8 శాతం నష్టపోయి రూ.90.82 వద్ద నిలిచింది.
- అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, నెస్లె, ఎల్‌అండ్‌టీ, మారుతి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, టాటా మోటర్స్ షేర్లు కూడా పతనం చెందాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా 1.46 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.

బంగారం మరింత పైకి

బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు ప్రస్తుత పండుగ సీజన్‌లో ఆభరణాల కొనుగోళ్లు ఊపందుకోవడంతో దేశీయంగా ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.250 అధికమై రూ.78,700 పలికింది. కానీ, వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర రూ.200 దిగొచ్చి రూ.94,200 నుంచి రూ.94,200కి దిగినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,671.50 డాలర్ల వద్ద, వెండి 32.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను నియమించుకున్నది. ఈ సందర్భంగా సచిన్‌తో బీవోబీ ఎండీ, సీఈవో దేబదత్త చంద్

లాట్ మొబైల్స్‌లో దసరా-దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 7: ప్రముఖ స్మార్ట్ ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ లాట్ మొబైల్స్ 12వ వార్షికోత్సవంతోపాటు దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకొని వినూత్న ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేసినవారికి కనీ వినీ ఎరుగని విధంగా 9 ఆఫర్లను ప్రకటించినట్లు కంపెనీ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. ఈ ఆఫర్లలో రూ.9,999 వరకు కొనుగోలు చేసే ప్రతిదానిపై ఖచ్చితమైన బహుమతితోపాటు స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీలపై 40 శాతం వరకు తగ్గింపు ఆఫర్‌తోపాటు 10 శాతం తక్షణ నగదు వాపస్, ఎలాంటి ముందస్తు చెల్లింపులు జరపకుండానే నో కాస్ట్ ఈఎంఐ స్కీం, ఎస్బీఐ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు తక్షణ తగ్గింపు, బ్యాండెడ్ యాక్సెసిరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపు, ఓప్పో ఫోన్లపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల నగదు, ఎంఐ, రియల్‌మీ మొబైళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైక్స్, మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించింది.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత

చిన్నగూడూరు, అక్టోబర్ 7 : మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన మెట్టు వెంకన్న, కమలమ్మ కొడుకు రాజు పుట్టుకతోనే దివ్యాంగుడు. కాళ్లు, చేతులు చచ్చుబడిపోయి నడవలేని స్థితిలో ఉన్నాడు. కాగా, కురవికి చెందిన ఇన్‌స్టాగ్రామ్ రఘుకు స్థానికులు సమాచారం అందించగా, విషయాన్ని అందులో పోస్టు చేశారు. దీనికి విదేశీయురాలు రిషిక స్పందించి రఘు ద్వారా దివ్యాంగుడికి సోమవారం వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రఘును అభినందించారు. కార్యక్రమంలో కార్తీక్, యాకన్న పాల్గొన్నారు.

బాల వికాస సేవలు అభినందనీయం

దంతాలపల్లి, అక్టోబర్ 7 : బాల వికాస సంస్థ సేవలు అభినందనీయమని తహసీల్దార్ చంద్రరాజేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్‌లో బాల వికాస ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివేక్‌రామ్, మాజీ ఎంపీటీసీలు కిశోర్‌కుమార్, యాకన్న, బాలమోహన్, సంపత్‌రెడ్డి, సుధాకర్, హెచ్ఎం వేణుమాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

దంతాలపల్లి, అక్టోబర్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తొర్రూరు డివిజన్ కార్యదర్శి లింగన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావొస్తున్నా, నేటికీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, వల్లపు సాయిలు, ఊడుగుల పెద్ద లింగన్న, సంపత్, శ్రీను పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

దుకాణాలను తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందం

దంతాలపల్లి, అక్టోబర్ 7 : మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో సోమవారం ప్రత్యేక ధ్రువీకరణ టీమ్ తనిఖీలు చేపట్టింది. మండలు స్టాక్ వివరాలు, రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు ఎరువులు అందించిన వెంటనే బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీం సభ్యులు వినయ్, భాస్కర్, శ్రీదేవి, స్వామి, ఏఈవో దీక్షిత్‌కుమార్ పాల్గొన్నారు.

మాలముత్యాలమ్మ గుడికి భూమి పూజ

ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

నెల్లికుదురు, అక్టోబర్ 7 : మండల కేంద్రంలో మాలముత్యాలమ్మ గుడి నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆలయ నిర్మాణానికి కొబ్బరిమరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ కార్యదర్శి అశోద బాస్కర్, నాయకులు గారె ఉపేందర్, కారం ప్రశాంత్, సంజీవ, దర్గయ్య, ఉప్పలయ్య, వెంకన్న, భిక్షపతి పాల్గొన్నారు.

శాకంబరీగా దుర్గామాత

బయ్యారం : దుర్గామాతకు 108 నైవేద్యాలతో పూజలు చేస్తున్న అర్చకులు

బయ్యారం, అక్టోబర్ 7 : దేవీనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు దుర్గామాత అమ్మవారు శాకంబరీగా దర్శనమిచ్చారు. బయ్యారం మండల కేంద్రంలోని కోదండరామస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు భక్తులు 108 రకాల నైవేద్యాలను సమర్పించారు. ఆలయ అర్చకుకు సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

దుర్గామాత మండపం వద్ద అన్నదానం

చిన్నగూడూరు : మండల కేంద్రంలోని బొడ్రాయి బజార్‌లో రైస్ మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు గ్రామస్తులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు రైస్‌మిల్లు యజమాని ఈశ్వర్‌రావు అన్నదానం చేశారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

దంతాలపల్లి : మండలంలో దేవిశరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఐదో రోజు అమ్మవారు మహాచండీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దంతాలపల్లి, రేపోణి, పెద్దముప్పారం గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

చిన్నగూడూరు : మండపం వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

దంతాలపల్లి : గున్నెపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

కారు ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

తొర్రూరు, అక్టోబర్ 7: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని మడిపల్లి శివారు సోమారపుకుంటతండావద్ద సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు సాయమ్మ తన మనవడి బైక్‌పై వస్తుండగా కారు ఢీకొట్టింది. సాయమ్మకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గుర్తించి 108వాహనంలో వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. ప్రస్తుతం సాయమ్మ పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి

గోవిందమ్మ(ఫైల్)

ఇనుగుర్తి, అక్టోబర్ 7 : మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు కనికిచర్ల గోవిందమ్మ(101) సోమవారం మృతిచెందారు. ఆమె కొడుకు హనుమంతరావు కథనం ప్రకారం.. గోవిందమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం ఉదయం మృతి చెందారు.

క్రీడలతో మానసికోల్లాసం : సీఐ జగదీశ్

తొర్రూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ జగదీశ్

తొర్రూరు, అక్టోబర్ 7: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని తొర్రూరు సీఐ జగదీశ్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంప్లాయీస్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు సోమవారం ఎంఈవో మహంకాళి బుచ్చయ్య, డివిజనల్ ఇంజినీర్ మధుసూదన్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జెల్ల లక్ష్మీనారాయణ, రేవూరి నర్సయ్యతో కలిసి సీఐ బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి దేవులపల్లి శంకర్ టీం, ద్వితీయ పోరండ్ల నాగరాజు టీం, తృతీయ పాలబిందెల సంతోష్ టీంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గోడిశాల నగేశ్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, గీత, మదర్ వలంటరీఅధ్యక్షుడు విక్రమ్, రమాకాంత్, రేవూరి శ్రీధర్, మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి శంకర్, కోశాధికారి తుమ్మల ఫణీంద్ర, కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, జోగి వెంకన్న పాల్గొన్నారు.

లయన్స్ భవన్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సేవా తరుణి ప్రతినిధులు

సేవా తరుణి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

తొర్రూరు, అక్టోబర్ 7: లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320 ఎఫ్ బతుకమ్మ సంబరాల్లో భాగంగా తొర్రూరు సేవా తరుణి ఆధ్వర్యంలో ఎఫ్‌డబ్ల్యూసీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ వేలూరి శారద నిర్వహణలో లయన్స్ భవన్‌లో బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. 150 మంది మహిళలు బతుకమ్మలతో కోలాటమాడారు. అనంతరం బతుకమ్మలను స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ ఎన్ సుధాకర్‌రెడ్డి-అనిత, పాస్ట్ జిల్లా గవర్నర్ కుందూరు రాజేందర్‌రెడ్డి-గీత, తమ్మెర లక్ష్మీనర్సింహారావు, మచ్చ రాజిరెడ్డి-అరుణ, అజిత్-చరిత తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుపై తండావాసుల ఆందోళన

తొర్రూరు, అక్టోబర్ 7: మున్సిపాలిటీకి సంబంధించిన చెత్త హచ్చుతండా శివారులో డంపింగ్ చేస్తుండడంతో తండావాసులు ఆందోళన చేశారు. సోమవారం చెత్త డంపింగ్ చేయకుండా ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బందోబస్తు నడుమ చెత్తను డంపింగ్ చేశారు. దీనిపై తండావాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు తండావాసులు మాట్లాడుతూ తొర్రూరు మున్సిపాలిటీకి సంబంధించిన చెత్తను తన తండా శివారులో పోయడంతో పొగ, దుర్వాసనతో రోగాలు, శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా డంపింగ్ యార్డును వేరే చోట ఏర్పాటు చేయాలని కోరారు.

రావణ వధ ఏర్పాట్ల పరిశీలన

తొర్రూరు, అక్టోబర్ 7 : దసరా ఉత్సవాల్లో భాగంగా ఓట్స్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్క్‌లో నిర్వహించే రావణ వధ ఏర్పాట్లను సోమవారం పలువురు నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో టీపీసీసీ మాజీ సభ్యుడు నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు మామిడాల తిరుపతిరెడ్డి, విజయపాల్‌రెడ్డి, సోమయ్య, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు సంతోష్, సోమరాజశేఖర్, మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బడె నాగజ్యోతి

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కొత్తగూడ, అక్టోబర్ 7 : మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్ట ఉపేందర్ తల్లి వట్టం సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడె నాగజ్యోతి సమ్మక్క చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు జగదీశ్, మండల అధ్యక్షుడు వేణు, ఇర్ప సూరయ్య, మాజీ ఎంపీటీసీ స్వప్నాలింగన్న, సర్పంచ్ రజితారమేశ్, ప్రశాంత్, సంతోషిరాణీవెంకటేశ్, పూనెం లక్ష్మీ నర్సు, వట్టం సంపత్, కల్తి వీరయ్య, స్వరూప పాల్గొన్నారు.

మహిళ లందరికీ బతుకమ్మ చీరెలు ఇవ్వాలి

మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

గార్ల, అక్టోబర్ 7: మహిళలందరికీ బతుకమ్మ చీరెలు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి కార్యవర్గ సభ్యుడు, మాజీ వైస్ ఎంపీపీ కట్టెబోయిన శ్రీనివాస్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చే